క్లుప్తంగా

కందుకూరు మండల ప్రత్యేకాధికారిగా సుధారాణి



సుధారాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కందుకూరు: కందుకూరు మండల ప్రత్యేకాధికారిగా మహేశ్వరం ఏడీఏ సుధారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ ప్రత్యేకాధికారిగా పనిచేసిన రాష్ట్ర ఆడిట్ డిపార్ట్‌మెంట్ డీడీ వెంకట్.. తన కార్యాలయంలో పని ఒత్తిడి కారణంగా ప్రభుత్వం ఆయన స్థానంలో ఆమెను ఇక్కడ నియమించింది.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రావు

హుడాకాంప్లెక్స్: ప్రజలకు అసౌకర్యం కలగకుండా డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం డాక్టర్స్ కాలనీ రోడ్ నంబర్–4లో సీవరేజ్ బోర్డు, డ్రైనేజీ లైన్ పనులను కాలనీవాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ, ఆచార్యులు, ఉమాపతి, సత్యనారాయణ, అధికారులు ప్రవీణ్, సూపర్‌వైజర్ శంకర్‌లు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి కృషి
బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్



బోరుమోటార్ వద్ద కౌన్సిలర్, యువజన సంఘం నాయకులు

తుక్కుగూడ: వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలోని ఛత్రపతి యువజన సంఘం వద్ద నూతన బోరు మోటార్‌ను బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్య పరిష్కారం, తాగు నీరు అందించడానికి బోరు మోటార్‌ను బిగించామన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం



కేఎల్‌ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీర్‌ఖాన్‌పేటవాసులు

కందుకూరు: ఫార్మాలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ అన్నారు. భూములు కోల్పోయిన మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన రైతులు.. గురువారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ వారితో మాట్లాడారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. టీజీఐసీసీ అధికారులు, స్థానిక నాయకులతో చర్చించి ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారంతో పాటు గతంలో ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా ఇల్లీగల్‌గా స్థలాలు పొందినా వారిని గుర్తించి తొలగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి

మాడ్గుల: దసరా పండుగకు సొంతూర్లకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సీఐ జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో డబ్బులు, బంగారం, విలువైన పత్రాలను ఉంచరాదని, బ్యాంకు లాకర్లలో భద్రపర్చాలని వెల్లడించారు. లేని యెడలా వెంట తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వీధుల్లో ఎవరైనా కొత్తవారు సంచరిస్తే.. వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ వెల్లడించారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

- నాలుగు సంవత్సరాలైనా పూర్తికాని నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మీర్‌ఖాన్‌పేట వయా కందుకూరు రోడ్డు దుస్థితి

కందుకూరు: అసంపూర్తి రహదారి నిర్మాణ పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి నాలుగేళ్లు దాటినా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే నన్న చందంగా.. రోడ్డును తవ్వి మట్టి పోసి వదిలేశారు. ఇదీ.. మండల పరిధి వావిళ్లకుంటతండా పెద్దమ్మ దేవాలయం నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా యాచారం ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి ఇది.

13.2 కిలో మీటర్లు

మండల పరిధి బేగరికంచె పరిధి వావిళ్లకుంటతండా ఫార్మా రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా యాచారం వరకు 13.2333 కి.మీ. రోడ్డు విస్తరణకు 2019లో నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ.84.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2020లో నిర్మాణ పనులు ప్రారంభించింది. కానీ భూసేకరణ పూర్తికాలేదు. కేవలం నందివనపర్తి, మీర్‌ఖాపేట గ్రామాల్లో మాత్రమే సుమారు రెండున్నర కిలో మీటర్ల మేర సీసీ, బీటీ రహదారిని నిర్మించారు.

మట్టి పనులతో మమ..

ఫార్మా రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు కొంత దూరం బీటీని నిర్మించారు. అక్కడి నుంచి గ్రామం ప్రారంభం వరకు తవ్వి మట్టిపోసి వదిలేశారు. గ్రామం దాటిన తర్వాత సింగారం మధ్యలో తవ్వకాలు జరిపి, మట్టి పనులు చేసి మమ అనిపించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మట్టిపోసి వదిలేయడంతో బురదమయంగా మారి, గోతులు ఏర్పడి రవాణా సౌకర్యానికి ఆటంకం కలిగిస్తోంది. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదాలు జరుగుతున్నాయి



మీర్‌ఖాన్‌పేట నుంచి వావిళ్లకుంటతండా, సింగారం వైపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయలేదు. మట్టి పోసి వదిలేశారు. దీంతో బురదమయంగా మారి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. కందుకూరు, యాచారం వైపు మార్గం అదే విధంగా ఉంది. ఇరువైపులా సుమారు మూడున్నర కి.మీ. మేర రోడ్డును తవ్వి, మట్టి పనులు చేసి వదిలేశారు. అధికారులు స్పందించి, త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి, రవాణ సౌకర్యాన్ని మెరుగు పర్చాలి.

– కాకి రవి, మీర్‌ఖాన్‌పేట

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



తుక్కుగూడ: రావిర్యాల ఎల్లమ్మ ఆలయం వద్ద హోమం చేస్తున్న చైర్మన్ దంపతులు



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

శ్రీకాత్యాయినిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మొదటిరోజు శ్రీకాత్యాయినిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి హారతి, అభిషేకం, అర్చన, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, హోమం, మంత్ర పుష్పం, గణపతి, నవగ్రహ హోమం, శ్రీకాత్యాయినిదేవి సహస్రనామం, తీర్థ ప్రసాద వితరణ వంటి పూజలు నిర్వహించారు. మహేశ్వరం గ్రామానికి చెందిన కర్రోళ్ల భానుచంద్ ముదిరాజ్ శివలీల దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ కర్రోళ్ల రాములు ముదిరాజ్, ఆలయ ఈఓ మురళీకృష్ణ, డైరెక్టర్లు, ఆలయ డైరెక్టర్లు ఎం.రాకేశ్, రాకేశ్, ఎస్.కన్నయ్య, కె.జగన్, సాయిలు, కె.శ్రీశైలం, అర్చకులు వీరేశం, రాజు, జగదీశ్, చెన్న బస్వ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: కాత్యాయినిదేవి అలంకారంలో..

బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ వ్యాప్తంగా దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. మొదటిరోజు బాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఎల్లమ్మ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: హోమం చేస్తున్న భక్తులు



మహేశ్వరం: మన్నాన్‌పల్లిలో అమ్మవారి పూజలో గ్రామస్తులు

దేవాలయంలో హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, కార్పొరేటర్లు, స్థానికులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట 23వ డివిజన్‌లో ప్రసిద్ధి చెందిన కాశిబుగ్గ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం హాల్ నిర్మాణానికి గురువారం మేయర్ చిగురింత పారిజాత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రసిద్ధి చెందిన దేవస్థానంలో శివుడు, వేంకటేశ్వరుడి దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం హాల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూడు నెలల్లో హాల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ హాల్‌లో చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, స్థానిక కార్పొరేటర్ సంతోషి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, సుదర్శన్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు మధు మోహనాచార్యులు, జగన్‌మోహన్ చార్యులు పాల్గొన్నారు.

'మా భూమిని కాపాడండి'

పహాడీషరీఫ్: భూమిని ఆక్రమించిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకొని, మా భూమిని కాపాడాలని గురువారం మామిడిపల్లి గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మామిడిపల్లి గ్రామంలో 2007 గ్రామానికి చెందిన గొండ్యాల, కోట్ల వశంస్తులకు చెందిన సుమారు 50 మంది రైతులు సర్వేనంబర్ 99/1 భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గత రాత్రి బుధవారం తమ భూమికి ఆనుకొని ఉన్న భూ యజమాని, తమ పొలాలను ఆక్రమించి షెడ్లను కూల్చివేశారని వాపోయారు. భూ వివాదం చాలాకాలంగా జరుగుతోందని, ఇదే విషయమై గతంలో మండల రెవెన్యూ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డికి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి, ఇరువురి భూముల రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

జీపీ సిబ్బందికి దసరా కానుక

తలకొండపల్లి: దసరా పండుగ సందర్భంగా మండల పరిధి రాంపూర్ పంచాయతీ సిబ్బందికి గురువారం హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ నర్సింహులు కానుకగా.. నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధి జూలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి తల్లి పూలమ్మ(75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మె ల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. రేణురెడ్డి, రఘుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.